RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 284 | సంపుటి 4 | గురువారం | 16-07-2026 | పేజీలు 4 | వెల 3/-



04

## వరంగల్ ప్రెస్ క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించాలి

- అక్రమాల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి క్లబ్ ను ప్రక్షాళన చేయాలి
- అర్హులైన జర్నలిస్టులందరికీ వివక్ష లేకుండా సభ్యత్వం కల్పించాలి
- హన్మకొండ కలెక్టర్ కు డబ్ల్యూజేఐ నాయకుల వినతి

వరంగల్ గ్రేటర్ ప్రెస్ క్లబ్ కు తక్షణమే ఎన్నికలు నిర్వహించి, క్లబ్ కార్యకలాపాల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) నాయకులు డిమాండ్ చేశారు. ప్రెస్ క్లబ్ నిర్వహణను ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ హన్మకొండ జిల్లా కలెక్టర్ కు మెమోరాండం అందజేశారు. ప్రస్తుత ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నికై మూడున్నరేళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఒక్కసారి కూడా జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించలేదని డబ్ల్యూజేఐ నాయకులు ఆరోపించారు.

# శాంతిభద్రతల రక్షకురాలు..



3

- 'ఫ్రెండ్లీ పోలీసింగ్' రూపకర్త;
- నేరగాళ్లకు సింహస్వప్నం.. బాధితులకు ఆపన్నహస్తం..!
- ఒక చేత్తో నేరగాళ్లపై ఉక్కుపాదం.. మరో చేత్తో బాధితులకు భరోసా
- మహిళల భద్రతే ప్రధాన లక్ష్యం
- వరంగల్ పోరు గడ్డపై తొలి మహిళా పోలీస్ కమిషనర్ గా ఎన్.శ్వేతా రెడ్డి బాధ్యతలు

తెలంగాణ పోలీసు శాఖలో సమర్థవంతమైన అధికారిణిగా గుర్తింపు పొందిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ప్రజాస్నేహ పోలీసింగ్ కు ప్రాధాన్యం ఇస్తూ కమిషనరేట్ పరిధిలో తనదైన ముద్ర వేస్తున్నారు. చట్ట అమలుతో పాటు ప్రజల్లో పోలీసులపై విశ్వాసాన్ని పెంపొందించడం, మహిళల భద్రత, సాంకేతికత ఆధారంగా నేరాల నియంత్రణకు ఆమె ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. పోలీస్ స్టేషన్ అంటే ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగిస్తూ, బాధితులు నిర్భయంగా తమ సమస్యలు చెప్పకునే వాతావరణాన్ని సీపీ ఎన్. శ్వేత కల్పిస్తున్నారు. మహిళలు, విద్యార్థినుల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న ఆమె, షీ టీమ్స్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేశారు. విద్యాసంస్థల్లో సైబర్ నేరాలు, ఆత్మరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతలో చైతన్యం కల్పిస్తున్నారు. రాత్రివేళ మహిళల భద్రత కోసం ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టారు. ఫిర్యాదులపై తక్షణ స్పందన, పారదర్శక విచారణ, ప్రజలకు అందుబాటులో ఉండే విధానంతో "ఫ్రెండ్లీ పోలీసింగ్"కు కొత్త దిశ చూపుతున్నారు.

— వరంగల్, ప్రభాత గమనం క్రైమ్ బ్యూరో



04

## కాపర్ వైర్ చోరీ ముఠా అరెస్టు

- 312 కిలోల కాపర్ వైర్ స్వాధీనం
- నలుగురు నిందితులు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ మనన్ భట్

వ్యవసాయ ట్రాన్స్ ఫార్మర్ల నుండి కాపర్ వైర్ దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల ముఠాను ఏటూరు నాగారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి సుమారు 312 కిలోల కాపర్ వైర్, దొంగత నానికి ఉపయోగించిన ఆటో, కటింగ్ ప్లేయర్లు, పానాలు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

## వైమానిక దళంలో నియామకాలకు దరఖాస్తులు

- ఎయిర్ మెన్ (మెడికల్ అసిస్టెంట్), అగ్నివీర్ వాయు పోస్టుల భర్తీకి జూలై 26 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తులకు అవకాశం
- అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



04




2

## 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి

- ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్రం కట్టుబడి ఉంది
- ఉడాన్ పథకం కింద ఆమోదం..
- భూసేకరణ ఆలస్యంతోనే పనులు జాప్యం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు కూడా రానుందని వెల్లడింపు

## బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది

### ఆగస్టు నుంచి అంగన్ వాడీల్లో బ్రేక్ ఫాస్ట్ పథకం

- వచ్చే నెల 15న ఉత్తమ సేవలందించిన అంగన్‌వాడీ సిబ్బందికి సన్మానం
- పిల్లలకు నాణ్యమైన పోషకాహారంలో నిర్లక్ష్యాన్ని సహించబోం
- రాష్ట్రవ్యాప్తంగా కొత్త భవనాలు, మొబైల్ అంగన్‌వాడీల ఏర్పాటు
- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, విద్య, సంరక్షణ అందించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అంగన్ వాడీ కేంద్రాల్లో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. సచివాలయంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి సీతక్క మాట్లాడుతూ, "బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది" అని పేర్కొన్నారు. అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను సొంత పిల్లల్లా భావించి సేవలందించాలని అధికారులకు సూచించారు. గుడ్లు, పాలు, పప్పు తదితర పోషకాహార సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించిన మంత్రి, నాసిరకం ఆహార సరఫరాపై వచ్చిన ఫిర్యాదులను తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. సంబంధిత జిల్లాల అధికారులు వెంటనే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పైలట్ గా అమలు చేస్తున్న బ్రేక్ ఫాస్ట్ పథకం మంచి ఫలితాలు ఇస్తోందని, దీంతో చిన్నారుల హాజరు, అభ్యాస సామర్థ్యం పెరిగాయని పేర్కొన్నారు. శాఖ కార్యదర్శి శృతి ఓజా, టీజీ ఫుడ్స్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ మోతి, పంచాయతీరాజ్ ఈఎన్సీ జోగారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



2



# బయ్యారం కాంగ్రెస్ అధ్యక్షుడిగా జూలకంటి సీతారాం రెడ్డి

- పార్టీ బలోపేతానికి శ్రమిస్తా: సీతారాం రెడ్డి
- అధిష్టానానికి, సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు

**బయ్యారం, జూలై 15 (ప్రభాత గమనం) :**

బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా జూలకంటి సీతారాం రెడ్డి నియమితుల య్యారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. మండల పార్టీ బాధ్యతలను సీతారాం రెడ్డికి అప్పగించడం పట్ల స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.ఈ సందర్భంగా జూలకంటి సీతారాం రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన పార్టీ అధిష్టానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసేందుకు, కాంగ్రెస్ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. తన నియామకానికి సహక రించి, ఆశీస్సులు అందించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ఇల్లందు శాసనస భ్యులు కోరం కనకయ్య, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ ఉమా మురళి నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మూల మధుకర్ రెడ్డిలకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, గార్ల సింగిల్ విండో చైర్మన్ దుర్గాప్రసాద్, సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్, డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి, చాగర్లమూడి భాస్కర్, నరేందర్ తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.



# అక్రమ రేషన్ బియ్యం నిల్వలపై పోలీసుల దాడి..

- 7 క్వింటాళ్ల 50 కిలోల బియ్యం స్వాధీనం
- నిందితుడు అరెస్ట్ చేసిన సీఐ ఆకునూరి మహేందర్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లాపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 7 క్వింటాళ్ల 50 కిలోల రేషన్ బియ్యం (16 ప్లాస్టిక్ సంచులు)ను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టే బుల్ డి. యాదగిరి, పోలీసు సిబ్బంది పి. ధనుంజయ్య, ఎం. భరత్లతో కలిసి ఎల్లాపూర్ గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, దండుగుల రమేష్ ఇంటి సమీపంలోని షెడ్డులో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో షెడ్డుపై దాడి చేసి తనిఖీ చేయగా, 16 ప్లాస్టిక్ సంచుల్లో 7 క్వింటాళ్ల 50 కిలోల రేషన్ బియ్యం లభ్యమైంది. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ.21 వేలగా పోలీసులు అంచనా వేశారు. విచారణలో నిందితుడు దండుగుల రమేష్ (42), ఎల్లాపూర్ గ్రామంకు చెందినవాడని, చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి కిలోకు రూ.10 చొప్పున రేషన్ బియ్యం కొనుగోలు చేసి, కిలో రూ.30కు విక్రయించేందుకు నిల్వ ఉంచినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ, పేదల కోసం ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరుపేదల హక్కులను దోచుకునే ఇటువంటి అక్రమ వ్యాపారాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.




# పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి వాటిని యజ మానులకు అప్పగించడంలో హసన్‌పర్తి పోలీసులు విజయవంతమయ్యారు. హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆధ్వర్యంలో, (సెంట్రల్ ఈక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ) పోర్టల్ సహాయంతో రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను బుధవారం బాధితులకు అందజేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వాటి వివరాలను కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో సిఈఐఆర్ నమోదు చేశారు. నంబర్లను బ్లాక్ చేసి అధునాతన సాంకేతిక నిఘా పరిజ్ఞానం ద్వారా వాటి ఆచూకీ (లొకేషన్) గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన ఫోన్లను ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ బాధితులకు అందజేయగా, తమ పోయిన ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు కాపీ ఆధారంగా సంచార్ సాథి వెబ్‌సైట్‌లోని మొబైల్‌ను వెంటనే బ్లాక్ చేయాలని తెలిపారు. దీంతో ఫోన్‌ను ఇతరులు దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవడంతో పాటు, పోలీసులు సులభంగా ట్రాక్ చేసి రికవరీ చేసే అవకాశం ఉంటుందని వివరించారు.


# పోలీస్ కంట్రోల్ రూంను పరిశీలించిన సీపీ

- అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి.. సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- ఆధునిక సాంకేతికతతో నేరాల నియంత్రణ, ట్రాఫిక్ పర్యవేక్షణ మరింత పటిష్టం చేయాలి

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు అత్యవసర పోలీస్ సేవలను మరింత వేగవంతంగా అందించేందుకు పోలీస్ కంట్రోల్ రూం, కమాండ్ కంట్రోల్ వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ కంట్రోల్ రూం, కమాండ్ కంట్రోల్ రూంను సంబంధిత అధికారులతో కలిసి పోలీస్ కమిషనర్ పరిశీలిం చారు. ఈ సందర్భంగా కంట్రోల్ రూం నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రజల నుంచి వచ్చే అత్యవసర కాల్స్‌ను స్వీకరించే విధానం, వాటిపై సంబంధిత పోలీస్ విభాగాలు స్పందిస్తున్న తీరు తదితర అంశాలను సమీక్షించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ద్వారా జరుగుతున్న పర్యవేక్షణను పరిశీలించిన సీపీ, కీలక ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, ట్రాఫిక్ పరిస్థితులపై నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు. ఏదైనా అనుమా నాస్పద ఘటన లేదా అత్యవసర పరిస్థితి గుర్తించిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్, పెట్రోలింగ్ సిబ్బందిని అప్రమత్తం చేసి వేగంగా స్పందించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అత్యవసర సమాచారాన్ని అత్యంత బాధ్యతతో స్వీక రించాలని, కంట్రోల్ రూం సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ అవసరమైన సమాచారాన్ని క్షేత్రస్థాయి పోలీస్ సిబ్బందికి తక్షణమే చేరవేయాలని సీపీ సూచించారు. అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన వేగం ప్రజల భద్రతలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొ న్నారు. అదేవిధంగా కమాండ్ కంట్రోల్ రూంలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాల ని అధికారులకు సూచించారు. నేరాల నియంత్రణ, నేరస్తుల కదలికల గుర్తింపు, ట్రాఫిక్ పర్యవేక్షణ, శాంతిభద్రతల నిర్వహణతో పాటు ము ఖ్యమైన ఘటనల సమయంలో వివిధ పోలీస్ విభాగాల మధ్య సమన్వ యాన్ని మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. సాంకేతిక వ్యవస్థల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేస్తూ పోలీసింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ పరిశీలనలో అదనపు డీసీపీ లు ప్రభాకర్ రావు, శ్రీనివాస్, ఏసీపీ జితేందర్ రెడ్డి, ఆర్ఐ సతీష్, క్లూ స్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ఎస్ఐ రోహిత్, ఆర్ఎస్ఐ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.




# 2028 నాటికి వరంగల్ ఎయిర్ పోర్టు పూర్తి

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు వెల్లడి

హైదరాబాద్,ప్రభాత గమనం,జూలై15:వరంగల్ ఎయిర్‌పోర్టును 2028 నాటికి పూర్తిచే యాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అయితే ఆ క్రెడిట్ తీసుకునేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 2011లో రైట్స్ కంపెనీ దేశంలో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు సాధ్యాసాధ్యాలపై చేసిన అధ్యయనంలో వరంగల్, కడప పేర్లు ఉన్నాయి. మోదీ ప్రభుత్వం వచ్చాక ఉడాన్ స్కీంతో ఎయిర్ పోర్టుల పెంపునకు శ్రీకారం చుట్టింది. కొత్తగా 88 ఎయిర్‌పోర్టులకు ఆమోదం తెలిపింది. అందులో వరంగల్ కూడా ఉంది. భూసేకరణ పూర్తికాకపోవడం వల్లే ఎయిర్ పోర్టు నిర్మాణం ఇంత ఆలస్యమైంది. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు వస్తోందంటే దానికి కారణం మోదీ. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు రాబోతోందని రామచందర్‌రావు చెప్పారు.

# కరీంనగర్ అభివృద్ధికి మరిన్ని నిధులు తెస్తా

- సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి సంజయ్

హైదరాబాద్, ప్రభాత గమనం,జూలై15: కరీంనగర్ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. నగరాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. నగరంలోని 47వ డివిజన్‌లో యూడీఎఫ్ నిధులు రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ బుధవారం శంకుస్థా పన చేశారు. అనంతరం 62వ డివిజన్ మంకమ్మతోటలో రూ.98 లక్షల వ్యయంతో చేపట్ట నున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు మేయర్ శ్రీనివాస్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధే లక్ష్యంగా బీజేపీ పని చేస్తోందన్నారు.



# బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది

## ఆగస్టు నుంచి అంగన్ వాడీల్లో బ్రేక్ ఫాస్ట్ పథకం

- వచ్చే నెల 15న ఉత్తమ సేవలందించిన అంగన్‌వాడీ సిబ్బందికి సన్మానం
- పిల్లలకు నాణ్యమైన పోషకాహారంలో నిర్లక్ష్యాన్ని సహించబోం
- రాష్ట్రవ్యాప్తంగా కొత్త అంగన్‌వాడీ భవనాలు, మొబైల్ అంగన్‌వాడీల ఏర్పాటు
- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్, ప్రభాత గమనం, జూలై 15 : చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, విద్య, సంరక్షణ అందించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. సచివాలయంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క మాట్లాడుతూ, "బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది" అని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారు లను సొంత పిల్లల్లా భావించి సేవలందించాలని అధికారులకు సూచించారు. గుడ్లు, పాలు, పప్పు తదితర పోషకాహార సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించిన మంత్రి, నాసిరకం ఆహార సరఫరాపై వచ్చిన ఫిర్యాదులను తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. సంబంధిత జిల్లాల అధికారులు వెంటనే నివేదికలు సమ ర్పించాలని ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం, కుమురం భీం ఆసి ఫాబాద్ జిల్లాల్లో పైలట్‌గా అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకం మంచి ఫలితాలు ఇస్తోందని, దీంతో చిన్నారుల హాజరు, అభ్యాస సామర్థ్యం పెరిగాయని పేర్కొన్నారు. ఈ విజయాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేయాలని అధికా



రులను ఆదేశించారు. ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిన 2,500 కొత్త అంగన్‌వాడీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, అవస రమైతే మరో 2,500 నుంచి 3,000 భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్, తాగునీరు, మరుగు దొడ్లు, పైప్‌లైన్ నీటి వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించా లని స్పష్టం చేశారు. వలస కార్మికుల పిల్లల కోసం ప్రారంభించిన మొబైల్ అంగన్‌వాడీలను ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాలని, మారుమూల గుత్తికోయ గూడేల్లోని చిన్నారులకు సైతం ప్రభుత్వ సేవలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని అధికారులను ఆదేశిం చారు. అంగన్‌వాడీ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని, రాష్ట్రాన్ని బాల్య వివాహాల రహిత తెలంగాణగా తీర్చిదిద్దేందుకు ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ వ్యవస్థలో అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, టీచర్లు, ఆయాలను గుర్తించి ఆగస్టు 15న ఉత్తమ సేవలందించిన సిబ్బందిని సన్మానిస్తామని మంత్రి సీతక్క ప్రకటించారు. అలాగే ప్రతి జిల్లా నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలు, సూచనలు తెలుసుకుని వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు బి.అపర్ణ, మర్రిపల్లి చందన, ప్రేమలతా అగర్వాల్, కంచర్ల వందనగౌడ్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శృతి ఓజా, టీజీ ఫుడ్స్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ మోతి, పంచాయతీరాజ్ ఈఎన్సీ జోగారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మాదాపూర్ లో వ్యక్తి దారుణ హత్య

- కత్తులతో దాడి చేసి కిరాతకంగా పొడిచిన హంతకులు
- ఘటనకు ప్రేమ వ్యవహారమే కారణం

హైదరాబాద్, ప్రభాత గమనం, జూలై15: నగరంలోని మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కత్తులతో దాడి చేసి మరీ యువకుడిని కొందరు వ్యక్తులు కిరాతకంగా చంపేశారు. మృతుడు వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చిన్నపల్లి భాస్కర్‌గా పోలీసులు గుర్తించారు. కులాంతర ప్రేమ వ్యవహారమే హత్యకు కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన యువతిని భాస్కర్ ప్రేమించాడు. అయితే కులం వేరు కావడంతో వారి ప్రేమను అమ్మాయి కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. మూడేళ్ల క్రితం అమ్మాయిని వేరే వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. అప్పటి నుంచి కుటుంబంలో తరుచూ గొడవలు జరగగా, వారు విడాకులు తీసుకున్నారు. అయితే తన కూతురి వివాహ జీవితం భగ్నం కావడానికి కారణం గతంలో ప్రేమించిన భాస్కర్ అని తెలిసిన యువతి తండ్రి రాజు కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని అయ్యప్ప సొసైటీలో భాస్కర్ ఉంటున్న హాస్టల్‌కు ఐదుగురు వ్యక్తులు వచ్చారు. హాస్టల్ నుంచి కిందకు వచ్చిన భాస్కర్‌ను దుండగులు అతి కిరాతకంగా కత్తులతో పొడిచి చంపేశారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిట లేకి తరలించారు. కాగా, యువతి కుటుంబసభ్యులే తన తమ్ముడిని హత్య చేశా రంటూ భాస్కర్ అన్న మధు మాదాపూర్ పీఎస్ లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.




# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఆరుగురు వ్యక్తులు అరెస్ట్
- రూ.7,450 నగదు, రెండు బైక్ లు, 5 ఫోన్లు స్వాధీనం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

భూపాలపల్లి జిల్లా సిసిఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలోనీ సీసీఎస్ పోలీసులు బుధవారం సాయంత్రం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం గ్రామం–ఆజాంనగర్ అటవీ ప్రాంతంలో పేకాట నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో 6 మంది నిందితులను అదుపులోకి తీసుకోగా, వారి వద్ద నుంచి రూ.7,450 నగదు, రెండు బైక్లు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాడి జరుగుతున్న సమయంలో మరో 7 మంది నిందితులు పరారయ్యారు. అరెస్టు చేసిన నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదు మరియు ఇతర వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై కి అప్పగించారు. పరారీలో ఉన్న నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై జిల్లా పోలీసులు ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు కొనసాగిస్తారని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు ఇటువంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్–100కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.



# కౌలు రైతుల కోసం మరో పోరాటం

- కౌలు రైతులకు అందని ఎరువులు,రైతు భరోసా పథకాలు
- కౌలు రైతులను గుర్తించి న్యాయం చేయాలి
- డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్
- డీబీఎఫ్ ఆధ్వర్యంలో అదనపు తహసీల్దార్ రవికి వినతిపత్రం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ప్రభుత్వము కౌలు రైతుల గుర్తింపు చేపట్టే వరకు మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టి పోరాడుతామని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ హెచ్చరించారు. ఈ మేరకు ప్రభుత్వం కవులు రైతులను గుర్తించాలని డిబిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం అదనపు తహసిల్దార్ రవికి వినతి పత్రం సమర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు లేకపోవడంతో ఎరువులు,రైతు భరోసాతో పాటు ఇతర సంక్షేమ పథకాలు అందడం లేదని అదే విధంగా పంట అమ్ముకోవడానికి ఇబ్బంది పడుతున్నారని వెంటనే ప్రభుత్వం స్పందించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు బొర్ర సంపూర్ణ,కార్యదర్శి బొౌతు రాధ, ఉపాధ్యక్షులు చుంచు నరేష్,మేకల అనిత, నాయకులు మాదాసి సురేష్,సముద్రాల కుమారస్వామి రుద్రారపు సౌందర్య, సముద్రాల అఖిల, రుద్రారపు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల రక్షకురాలు..

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

తెలంగాణ పోలీస్ శాఖలో అత్యంత సమర్థవంతమైన, డైనమిక్ అధికారిణిగా పేరు తెచ్చుకున్న ఎన్ శ్వేతా రెడ్డి వరంగల్ కమిషనరేట్ పరిధిలో తన దైన ముద్ర చాటుతున్నారు కేవలం చట్టాన్ని అమలు చేయడమే కాకుండా, ప్రజల హృదయాల్లో నమ్మకాన్ని నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు



**ప్రజాస్నేహ పోలీసింగ్‌కు సరికొత్త నిర్వచనం**

పోలీస్ స్టేషన్ అంటే భయపడే రోజులకు స్వస్తి పలికి, ప్రజలకు పోలీసులను మరింత చేరువ చేయడంలో సీపీ శ్వేత విజయవంతమవుతున్నారు బాధితులు నిర్భయంగా వచ్చి తమ సమస్యలను చెప్పుకునేలా వాతావరణాన్ని మార్చుతున్నారు ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో పారదర్శకతను పెంచడం ద్వారా 'ఫ్రెండ్లీ పోలీసింగ్'కు ఆమె సరికొత్త నిర్వచనం ఇచ్చారు.

**మహిళల రక్షణేప్రథమ. ప్రాధాన్యం**

మహిళలు, విద్యార్థినుల భద్రత విషయంలో సీపీ అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నారు. నగరంలో మహిళలపై వేధింపులనుఅరికట్టడానికి 'షీ టీమ్స్' వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. కళాశాలలు, పాఠశాలల వేదికగా విద్యార్థినులకు సైబర్ నేరాలపై, ఆత్మరక్షణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తూ వారిలో ధైర్యాన్ని నింపుతున్నారు. రాత్రి వేళల్లో మహిళలు సురక్షితంగా ప్రయాణించేలా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

**నేరాల నియంత్రణ.. టెక్నాలజీ వినియోగం**

మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల నియంత్రణలో సాంకేతికతను సీపీ శ్వేత అద్భుతంగా వాడుతున్నారు.నగరంలో శాంతిభద్రతల పర్యవేక్షణకు, నేరస్తులను త్వరితగతిన పట్టుకోవడానికి కమ్యూనిటీ పోలీసింగ్ కింద సీసీ కెమెరాల ఏర్పాటును విస్తృతం చేశారు.యువత భవితను నాశనం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ రవాణా, విక్రయాలపై కఠినమైన నిఘా ఉంచి, పలు ముఠాలను ఆటకట్టించారు.

- 'ఫ్రెండ్లీ పోలీసింగ్' రూపకర్త:
- నేరగాళ్లకు సింహస్వప్నం.. బాధితులకు ఆపన్నహస్తం..!
- ఒక చేత్తో నేరగాళ్లపై ఉక్కుపాదం.. మరో చేత్తో బాధితులకు భరోసా
- మహిళల భద్రతే ప్రధాన లక్ష్యం
- వరంగల్ పోరు గడ్డపై తొలి మహిళా పోలీస్ కమిషనర్ గా ఎన్.శ్వేతా రెడ్డి బాధ్యతలు



**యువతకు స్ఫూర్తిప్రదాత**

విధుల పట్ల అంకితభావం, సమాజం పట్ల బాధ్యత కలిగిన ఎన్. శ్వేత సివిల్స్ సాధించాలనుకునే ఎంతో మంది యువతులకు గొప్ప రోల్ మోడల్‌గా నిలిచారు. చట్టాన్ని గౌరవించే ప్రతి ఒక్కరికీ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఆమె నిరూపించారు. ఆమె నాయకత్వంలో వరంగల్ నగరం ప్రశాంతతకు నిలయంగా మారుతోంది.





# ప్రభుత్వ అధికారులకు కృత్రిమ మేధ వినియోగంపై సామర్థ్యాభివృద్ధి శిక్షణ

- ఏఐతో పరిపాలనా పనుల్లో వేగం, సామర్థ్యం పెంపు
- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ప్రభుత్వ కార్యాలయాల్లో పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు రోజువారీ విధులను మరింత వేగంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ (టి–ఫైబర్) ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో "ఏఐ ఫర్ అడ్మినిస్ట్రేటివ్ ఎఫిషీయేన్సీ" అంశంపై ప్రభుత్వ అధికారులు, సాంకేతిక సిబ్బందికి ఒకరోజు సామర్థ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రభుత్వ అధికారులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రోజువారీగా నిర్వహించే సాధారణ పనుల్లో కృత్రిమ మేధస్సు ఆధారిత సాధనాలను సరైన పద్ధతిలో వినియోగిస్తే సమయం ఆదా కావడంతో పాటు పనుల్లో వేగం, నాణ్యత, సామర్థ్యం పెరుగుతాయని తెలిపారు. అధికారిక లేఖలు, నివేదికలు, కార్యాలయ నోట్స్ తయారీ, సమావేశాల మినిట్స్ రూపొందించడం, పెద్ద పత్రాలను సంక్షిప్తీకరించడం, సమాచారాన్ని విశ్లేషించడం వంటి పనుల్లో ఏఐ సాధనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యాలయాల్లో ఫైళ్ల పరిశీలన, అవసరమైన సమాచారాన్ని త్వరగా సిద్ధం చేసుకోవడం వంటి ప్రక్రియల్లో సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా ఫైళ్ల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసే అవకాశం ఉంటుందన్నారు. అయితే, ఏఐ ద్వారా లభించే సమాచారాన్ని అధికారులు యథాతథంగా స్వీకరించకుండా సంబంధిత అధికారిక రికార్డులు, ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలతో ధృవీకరించుకోవడం అవసరమని సూచించారు. సాంకేతికతను బాధ్యతాయుతంగా, సరైన పద్ధతిలో ఉపయోగించినప్పుడే ఆశించిన ప్రయోజనాలు పొందగలమని కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో చాట్‌జీపీటీ (చాట్ జీపీటీ), గూగుల్ నోట్‌బుక్ ఎల్‌ఎమ్ (గూగుల్ నోటుబుక్ ఎల్‌ఎం), క్లాడ్ సహా మొత్తం 15 అధునాతన ఏఐ ఆధారిత ఉత్పాదకత సాధనాల వినియోగంపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ముఖ్యంగా అధికారిక లేఖల తయారీ, సమావేశాల మినిట్స్ రూపొందించడం, వివిధ పత్రాలు, నివేదికలను సంక్షిప్తీకరించడం, ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించడం, వచన రూపంలోని సమాచారాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు, వర్డ్ పత్రాలుగా మార్చడం, సమాచార సేకరణ, పరిశోధన, డేటా విశ్లేషణ తదితర అంశాలపై ప్రత్యక్ష శిక్షణ అందించారు. అదేవిధంగా ఇమెయిల్ నిర్వహణ, ఎక్సెల్‌లో డేటా విశ్లేషణ, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల రూపకల్పనతో పాటు రోజువారీ కార్యాలయ పనులను మరింత సులభతరం చేసేందుకు ఏఐ సాధనాలను ఏ విధంగా ఉపయోగించవచ్చో నిపుణులు వివరించారు. వివిధ శాఖల అవసరాలకు అనుగుణంగా సరైన సూచనలు (ప్రాంప్ట్స్) ఇవ్వడం ద్వారా ఏఐ నుంచి మెరుగైన ఫలితాలను పొందే విధానాన్ని కూడా వివరించారు. శిక్షకులు వాసుదేవన్ నటరాజన్, రాహుల్, ధీరజ్‌లు ఏఐ ఆధారిత సాధనాల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. ఏఐ సాధనాల వినియోగంతో సమయాన్ని ఆదా చేయడంతో పాటు ప్రజలకు సంబంధించిన పనులు, ఫైళ్ల పరిష్కారం, నివేదికల తయారీ వంటి ప్రక్రియలను మరింత వేగవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గణేష్, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి అధికారులు పాల్గొన్నారు.



# సీఐటీయూకు భారీ షాక్

- ఏఐటీయూసీలోకి చేరిన 40 మంది ఆర్టీసీ హైర్ బస్ కార్మికులు
- కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. అజయ్ సారధి రెడ్డి
- నూతన కౌన్సిలర్లుగా విజయం సాధించిన అజయ్ సారధి రెడ్డి, నవీన్ కు ఘన సన్మానం

**మహబూబాబాద్, జూలై 15 ( ప్రభాత గమనం) :**

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ కార్మిక సంఘానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక సీఐటీయూ అనుబంధ సంఘానికి చెందిన సుమారు 40 మంది ఆర్టీసీ హైర్ బస్ డ్రైవర్లు, క్లీనర్లు మరియు ఇతర కార్మికులు బుధవారం ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. అజయ్ సారధి రెడ్డి నూతనంగా చేరిన కార్మికులకు ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భం గా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. అజయ్ సారధి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ సంయుక్తంగా మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో కార్మికుల హక్కుల రక్షణ కోసం, ముఖ్యంగా హైర్ బస్ డ్రైవర్లు మరియు క్లీనర్ల సంక్షేమం కోసం ఏఐటీయూసీ నిరంతరం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మరియు జిల్లాలో అన్ని రంగాల కార్మికులు ఏఐటీయూసీ నాయకత్వంపై నమ్మకంతో భారీగా తరలివస్తున్నారని వారు పేర్కొన్నారు. "ఒకవైపు కార్మికుల సమస్యలపై యాజమాన్యాలతో సంప్రదింపులు జరుపుతూ, ప్రతి ఏటా రేట్లు పెరిగేలా ఒత్తిడి తెస్తున్నాం. మరోవైపు కార్మికులకు ఏ కష్టం వచ్చినా వీరోచిత పోరాటాలు చేయడానికి ఏఐటీయూసీ సిద్ధంగా ఉంటుంది."సిఐటియు నుండి ఏఐటీయూసీలో చేరిన వారిలో దొంతు రవీందర్ గౌడ్, గద్దం శ్రవణ్ కుమార్, రవీందర్, సంతోష్, సతీష్, రవికుమార్, వీరన్న, వెంకన్న, ఎలేందర్, బిక్షపతి, హైమద్, యాకయ్య, పవన్, నరేష్, రాజేష్, సురేష్, దసరు, నాగేష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కార్మికులు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 33వ వార్డు నుండి రికార్డు స్థాయిలో హ్యాట్రిక్ విజయం సాధించిన బి. అజయ్ సారధి రెడ్డిని, అలాగే 18వ వార్డు నుండి ఘన విజయం సాధించిన రేషపల్లి నవీన్‌ను కార్మికులు ఘనంగా శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. కార్మిక పక్షపాతులుగా ఉంటూ వార్డు కౌన్సిలర్లుగా విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.





# 'సర్' ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

- తిమ్మాపూర్ (హవేలీ), ఏనుమాముల, బాలాజీ నగర్, గుండ్ల సింగారం, బెస్తం చెరువు ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన
- బీఎల్ఓల పనితీరు, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పై ఆరా

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని తిమ్మాపూర్ (హవేలీ), ఏనుమాములలోని బాలాజీ నగర్, గుండ్ల సింగారం, బెస్తం చెరువు ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల వివరాల నమోదు, సేకరించిన సమాచారాన్ని డిజిటలైజేషన్ చేస్తున్న విధానాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా ఓటర్ల నుంచి సేకరించిన వివరాలను ఏ విధంగా డిజిటలైజేషన్ చేస్తున్నారనే అంశంపై బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, ఓటర్ల వివరాల పరిశీలనలో అనుసరిస్తున్న విధానం, ఎన్యుమరేషన్ ప్రక్రియ పురోగతి తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులోగా ఓటర్ల వివరాల పరిశీలన, ఎన్యుమరేషన్, డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ అత్యంత బాధ్యతతో నిర్వహించాల్సిన కార్యక్రమమని, ఇందులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని సూచించారు. ప్రతి ఇంటిని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ఓటర్ల వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు సంబంధిత ఓటరు స్లిప్‌ల డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని బీఎల్ఓలను ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ప్రతి ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా సాగాలని కలెక్టర్ పేర్కొన్నారు. బీఎల్ఓల పనితీరును సంబంధిత పర్యవేక్షణ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో సుమ, ఆర్డీవో కార్యాలయ ఏవో ఫణికుమార్, హసన్‌పర్తి తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ రజిని తదితర అధికారులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.



# ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- గార్ల మండలం రాంపురం, మద్దివంచ గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు
- తక్కువ నీటితో ఎక్కువ లాభాలు పొందడమే మార్గం :ఏఓ కావటి రామారావు
- పత్తి స్థానంలో బంతి సాగు.. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు

**గార్ల, జూలై 15 (ప్రభాత గమనం) :**

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎల్ నినో ప్రభావం వల్ల నెలకొన్న వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు రైతులు సాంప్రదాయ పంటల కంటే ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) కావటి రామారావు పిలుపునిచ్చారు. గార్ల మండల పరిధిలోని రాంపురం, మద్దివంచ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.రాంపురం సర్పంచ్ బాధవత్ సరోజ, మద్దివంచ సర్పంచ్ గుగులోత్ ప్రమీల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాలలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామారావు మాట్లాడుతూ, వాతావరణంలో వస్తున్న పెను మార్పులకు అనుగుణంగా రైతులు తమ సాగు పద్ధతులను మార్చుకోవాలన్నారు.నీటి వినియోగం ఎక్కువగా ఉండే దీర్ఘకాలిక పంటల కంటే.. తక్కువ నీటి తడులతో త్వరగా చేతికొచ్చే రాగులు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగు ఎంతో శ్రేయస్కరమన్నారు. కూరగాయల సాగు ద్వారా రైతులకు రోజువారీగా నిరంతర ఆదాయం లభిస్తుందని వివరించారు.కూరగాయల సాగుతో పాటు ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా సబ్సిడీలు అందుతాయని తెలిపారు.వ్యవసాయ శాఖ ద్వారా మినుములు, పెసలు, కందులు వంటి పప్పు దినుసుల విత్తనాలను సబ్సిడీపై స్థానిక రైతు వేదికల్లో అందుబాటులో ఉంచామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం, ప్రత్తి పంటకు ప్రత్యామ్నాయంగా స్థానిక రైతులు సాగు చేస్తున్న బంతి పూల తోటలను అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించారు. తక్కువ పెట్టుబడితో, వాతావరణ ఒడుదొడుకులను తట్టుకుని బంతి పూల సాగు ద్వారా రైతులు ఏ విధంగా లాభాలు ఆర్జించవచ్చో ఈ సందర్భంగా ఏఓ రామారావు రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ భరత్, వ్యవసాయ విస్తరణ అధికారులు రాజ్యలక్ష్మి , మేఘన పాల్గొన్నారు.



# మన ఓటు –మన బాధ్యత విజయవంతం చేయాలి

- డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

'సర్' కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మన ఓటు మన బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ 60వ డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 60వ డివిజన్ పరిధిలో బూత్‌లను సందర్శించి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడం, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు సమయానికి పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ పర్యటనలో మాజీ కార్పొరేటర్ నగరాజు, డివిజన్ అధ్యక్షుడు పున్నం సీనియర్ కాంగ్రెస్ నాయకులు జనగామ శ్రీనివాస్ తదితరులు పాల్గొని డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన వివరాలు సరిచూసుకొని, సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు సవరణ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు అప్పగింత

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లకు సంబంధించి నమోదైన ఫిర్యాదులపై సీఇఐఆర్ సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా 11 మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి యజమానులకు అప్పగించినట్లు మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి తెలిపారు. పోగొట్టుకున్న లేదా చోరికి గురైన మొబైల్ ఫోన్లను బాధితులు వెంటనే సీఇఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై గడ్డం ఉమ, ఏఎస్ఐ కరీముద్దీన్ మొబైల్ రికవరీ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

- మోసపోతే వెంటనే 1930కు కాల్ చేయండి
- జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహబూబాబాద్ జిల్లాలో ఇటీవల సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ సూచించారు. జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ సైబర్ హెల్ప్‌లైన్–1930 ద్వారా జిల్లాలో నమోదైన ఫిర్యాదుల ప్రకారం సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు.

**ఇటీవల జిల్లాలో నమోదైన సైబర్ మోసాల వివరాలు..**

- మరిపెడ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పెట్టుబడి వెబ్‌సైట్ ద్వారా ₹1,50,000 మోసం జరిగింది.
- నెల్లికుదురు పోలీస్ స్టేషన్ పరిధిలో అనధికారిక ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీ ద్వారా ₹3,50,000 కోల్పోయారు.
- డోర్నకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనధికారిక ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీ ద్వారా ₹1,00,000 నష్టం జరిగింది.
- కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో టెలిగ్రామ్ ట్రేడింగ్/ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో ₹1,71,000 మోసం చేశారు.
- కురవి పోలీస్ స్టేషన్ పరిధిలో మార్ఫింగ్ చేసిన నగ్న చిత్రాలతో బెదిరిస్తూ సెక్స్టార్షన్ ఘటన నమోదైంది.
- బయ్యారం పోలీస్ స్టేషన్ పరిధిలో యూపీఐ కలెక్ట్ రిక్వెస్ట్ (ఫోన్‌పే)



మోసం ద్వారా ₹9,879 కోల్పోయారు.

- మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా ₹49,000 మోసపోయారు.

ఈ కాలంలో జిల్లాలో మొత్తం 7 సైబర్ ఫిర్యాదులు నమోదుకాగా, అందులో 6 ఆర్థిక మోసాలు, 1 సెక్స్టార్షన్ కేసు నమోదైంది. మొత్తం ₹8,29,879 మేర ఆర్థిక నష్టం జరిగినట్లు వెల్లడైంది.

**సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న పద్ధతులు**

ఫేస్‌బుక్ ప్రకటనల ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించి నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ వెబ్‌సైట్లలో పెట్టుబడులు పెట్టించడం, టెలిగ్రామ్ ట్రేడింగ్ గ్రూపుల పేరుతో మోసాలకు పాల్పడటం, బ్యాంకు అధికారులు లేదా కంపెనీ ప్రతినిధులమని చెప్పి యూపీఐ కలెక్ట్ రిక్వెస్ట్‌లను ఆమోదింపజేయడం, బ్యాంకింగ్ వివరాలను సేకరించి అనధికారిక లావాదేవీలు నిర్వహించడం, వ్యక్తిగత ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించి డబ్బులు వసూలు చేయడం వంటి ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయని ఎస్పీ తెలిపారు.

**ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- అధిక లాభాలు వస్తాయని చెప్పే పెట్టుబడి పథకాలను నమ్మవద్దు.
- తెలియని వ్యక్తులు పంపిన యూపీఐ కలెక్ట్ రిక్వెస్ట్‌లను ఆమోదించవద్దు.
- ఓటీపీ, యూపీఐ పిన్, సీవీవీ, బ్యాంకు పాస్‌వర్డ్‌లు ఎవరితోనూ పంచుకోవద్దు.
- పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ, వెబ్‌సైట్ విశ్వసనీయతను నిర్ధారించుకోండి.
- టెలిగ్రామ్, వాట్సాప్‌లో తెలియని ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపుల్లో చేరవద్దు.
- వ్యక్తిగత ఫోటోలు, వీడియోలతో బెదిరించినా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు పంపవద్దు.
- బ్యాంకు ఖాతాలకు ట్రాన్సాక్షన్ అలర్ట్‌లను యాక్టివేట్ చేసుకుని లావాదేవీలను ఎప్పటికప్పుడు పరిశీలించండి.

సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నెంబర్ కి కాల్ చేయాలని ఎస్పీ సూచించారు. వెంటనే ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును ఫ్రీజ్ చేసి తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండడంతో పాటు కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా వృద్ధులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ విజ్ఞప్తి చేశారు.

# భూముల రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

- ఎంపిక చేసిన గ్రామాల్లో నెలాఖరులోగా క్షేత్రస్థాయి సర్వే, పేపర్ వర్క్ పూర్తి చేయాలి
- అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించి పనులు వేగవంతం చేయాలి
- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి ఆదేశాలు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



జిల్లాలో భూముల రీ సర్వేకు ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసి, ఈ నెలాఖరులోగా క్షేత్రస్థాయి సర్వేతో పాటు సంబంధిత పేపర్‌వర్క్‌ను పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి ప్రభుత్వ సర్వేయర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఎంపిక చేసిన గ్రామాల్లో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. భూముల కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్‌తో పాటు ప్రభుత్వ సర్వేయర్లతో గ్రామాలవారీగా సర్వే పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ పనులు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తిచేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించుకుని పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వేకు సంబంధించిన వివరాలు, నివేదికలు, ఇతర పత్రాలను ఎప్పటికప్పుడు సిద్ధం చేసి సకాలంలో సమర్పించాలని సర్వే బృందాలను ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయాన్నే సర్వే బృందాలు సంబంధిత గ్రామాలకు చేరుకుని క్షేత్రస్థాయి పనులను ప్రారంభించాలని ఆదేశించారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో భూముల రీ సర్వేను విజయవంతంగా నిర్వహించేందుకు రైతులు, భూ యజమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. సర్వే సమయంలో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి సర్వేతో పాటు దానికి సంబంధించిన పేపర్‌వర్క్ కూడా సమాంతరంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎంపిక చేసిన గ్రామాల్లో రీ సర్వే పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, నిర్ణయించిన గడువులోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేసేందుకు సర్వే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఎన్. రవి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, భూముల కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు సారంగపాణి, రాజనర్సయ్య, ప్రభుత్వ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



# కాపర్ వైర్ చోరీ ముఠా అరెస్టు

- 312 కిలోల కాపర్ వైర్ స్వాధీనం
- నలుగురు నిందితులు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ మనన్ భట్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల నుండి కాపర్ వైర్ దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల ముఠాను ఏటూరు నాగారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి సుమారు 312 కిలోల కాపర్ వైర్, దొంగతనానికి ఉపయోగించిన ఆటో, కటింగ్ ప్లేయర్లు, పానాలు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వాహనాల తనిఖీలో భాగంగా ఐటీడీఏ ఆఫీసు ముందు అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను ఆపి తనిఖీ చేయగా ఈ దొంగతనం వెలుగులోకి వచ్చింది. ఆటోలో ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా వ నేరాన్ని అంగీకరించారు. విచారణలో నిందితులు ములుగు జిల్లాలో 14, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 4 చొప్పున మొత్తం 18 ట్రాన్స్ ఫార్మర్ కాపర్ వైర్ దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వ్యవసాయ ట్రాన్స్ ఫార్మర్లు, మోటార్లను ధ్వంసం చేసి వాటిలోని కాపర్ వైర్‌ను తీసి, అనంతరం మణుగూరులోని స్క్రాప్ దుకాణాలకు విక్రయించి వచ్చిన డబ్బును పంచుకుని ఖర్చు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి సుమారు 312 కిలోల ట్రాన్స్ ఫార్మర్ కాపర్ వైర్, దొంగతనాలకు ఉపయోగించిన ఆటో, పనిముట్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో వెల్లడైన అంశాలతో పాటు, దొంగిలించిన కాపర్ వైర్‌ను కొనుగోలు చేసిన స్క్రాప్ వ్యాపారుల పాత్రపై కూడా పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. వ్యవసాయ ట్రాన్స్ ఫార్మర్లు, మోటార్లు లేదా విద్యుత్ పరికరాల వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ డయల్–100 కు గానీ సమాచారం ఇవ్వాలని ములుగు జిల్లా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వరంగల్ ప్రెస్ క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించాలి

- అక్రమాల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి క్లబ్ ను ప్రక్షాళన చేయాలి
- అర్హులైన జర్నలిస్టులందరికీ వివక్ష లేకుండా సభ్యత్వం కల్పించాలి
- హన్మకొండ కలెక్టర్ కు డబ్ల్యూజేఐ నాయకుల వినతి

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



వరంగల్ గ్రేటర్ ప్రెస్ క్లబ్‌కు తక్షణమే ఎన్నికలు నిర్వహించి, క్లబ్ కార్యకలాపాల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) నాయకులు డిమాండ్ చేశారు. ప్రెస్ క్లబ్ నిర్వహణను ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ హన్మకొండ జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. ప్రస్తుత ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నికై మూడున్నరేళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఒక్కసారి కూడా జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించలేదని డబ్ల్యూజేఐ నాయకులు ఆరోపించారు. ప్రెస్ క్లబ్ నిబంధనలు, బైలా ప్రకారం నిర్ణీత కాలవ్యవధిలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ వాటిని నిర్వహించకుండా ప్రస్తుత కమిటీ కొనసాగుతోందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో తక్షణమే ఎన్నికల ప్రక్రియ చేపట్టి, ప్రజాస్వామ్య పద్ధతిలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రెస్ క్లబ్ సభ్యత్వాల విషయంలోనూ వివక్ష కొనసాగుతోందని డబ్ల్యూజెఐ నాయకులు ఆరోపించారు. అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఎలాంటి పక్షపాతం, వివక్ష లేకుండా సభ్యత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. సభ్యత్వాల మంజూరులో పారదర్శక విధానాన్ని అమలు చేయడంతో పాటు అర్హులైన జర్నలిస్టులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా ఇప్పటివరకు ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఆర్థిక లావాదేవీలు, నిర్వహణకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ద్వారా సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్‌ను కోరారు. విచారణ ద్వారా వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి, అవసరమైన చర్యలు చేపట్టి ప్రెస్ క్లబ్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు వేదికగా ఉండాల్సిన ప్రెస్ క్లబ్ నిర్వహణ పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని డబ్ల్యూజెఐ నాయకులు పేర్కొన్నారు. జర్నలిస్టులందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఎన్నికల నిర్వహణకు వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూజెఐ రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రహ్మణ్యేశ్వరరావు (ఎన్.ఎస్.రావు), జిల్లా నాయకులు సిరికొండ భాస్కర్, నంబూద్రిపాద్, గుంటి విద్యాసాగర్, ఎండీ షంసుద్దీన్, రమేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# వైమానిక దళంలో నియామకాలకు దరఖాస్తులు

- ఎయిర్ మెన్ (మెడికల్ అసిస్టెంట్), అగ్నివీర్ వాయు పోస్టుల భర్తీకి జూలై 26 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తులకు అవకాశం
- అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



భారత వైమానిక దళంలో చేరి దేశానికి సేవలందించాలని ఆకాంక్షించే యువతకు మంచి అవకాశం లభించింది. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఎయిర్‌మెన్ (మెడికల్ అసిస్టెంట్), అగ్నివీర్‌వాయు (కంబాటెంట్) నియామకాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన యువత భారత వైమానిక దళంలో సేవలందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. నియామకాలకు సంబంధించిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ జూలై 6, 2026 ఉదయం 11 గంటలకు ప్రారంభమైందని, జూలై 26, 2026 రాత్రి 11 గంటల వరకు అవకాశం ఉందని పేర్కొ న్నారు. అధికారిక నియామక వెబ్‌సైట్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచిం చారు. అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్‌వాయుగా ఎంపికైన అభ్యర్థులు నాలుగేళ్ల పాటు భారత వైమానిక దళంలో సేవలందిస్తారని పేర్కొన్నారు. అనంతరం అమల్లో ఉన్న నిబంధనలు, ప్రతిభ మరియు సంస్థాగత అవసరాల ఆధారంగా అర్హులైన వారిలో గరిష్ఠంగా 25 శాతం మందికి రెగ్యులర్ కేడర్‌లో చేరేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి, నియామక నిబంధనల ప్రకారం తాత్కాలిక అడ్మిట్ కార్డు పొందిన అభ్యర్థులు మాత్రమే తదుపరి ఎంపిక ప్రక్రియకు హాజరయ్యేందుకు అర్హులవుతారని తెలిపారు. అభ్యర్థులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374